


# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక




సంపుటి-1, సంచిక-4, 08-08-2026, ఎడిటర్ : రాథోడ్ రాజు పేజీలు-4, వెల రూ. 4/-

Warangal, Ranga Reddy, Khammam, Nizamabad, Karimnagar, Hyderabad, Mahabubnagar, Visakhapatnam, Kadapa, Vijayawada, Tirupati, Guntur, Kurnool, Nellore, Srikakulam

## జాతీయ ఒబీసీ మహాసభకు శ్రీకారం

### డీకే శివకుమార్ చేతుల మీదుగా ప్రారంభం – సామాజిక న్యాయానికి కట్టుబాటని హామీ



బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బెంగళూరులో నిర్వహించిన జాతీయ ఒబీసీ మహాసంఘ్ 11వ జాతీయ మెగా సదస్సును ప్రారంభించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ బెంగళూరు సిటీ యూనివర్సిటీలోని జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి, వెనుకబడిన వర్గాల సాధికారత పట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి కట్టుబాటుతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని డీకే శివకుమార్ తెలిపారు. సమాన హక్కులు, అవకాశాలు అందరికీ అందేలా చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. జాతీయ ఒబీసీ మహాసంఘ్ అధ్యక్షుడు డాక్టర్ బాబన్‌రావు తైవాడే, కేపీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్, గ్యారంటీ పథకాల అమలు కమిటీ చైర్మన్ హెచ్.ఎం. రేవణ్ణతో పాటు పలువురు ఒబీసీ నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

సదస్సులో వెనుకబడిన వర్గాల సంక్షేమం, విద్యా అవకాశాలు, ఉపాధి, సామాజిక సాధికారతకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. దేశవ్యాప్తంగా ఒబీసీ వర్గాల అభ్యున్నతికి మరింత సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరాన్ని వక్తలు నొక్కిచెప్పారు. సామాజిక సమానత్వం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తామని ముఖ్యమంత్రి డీకే శివకుమార్

## ఏఐతో జీఎస్టీ వసూళ్లకు పదును

### – ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై సీఎం సమీక్ష
### – పన్ను లీకేజీల అరికట్టడంపై దృష్టి
### – అరవింద్ సుబ్రమణియన్‌తో విస్తృత చర్చలు



హైదరాబాద్, ఆగస్టు 7: తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయాన్ని పెంచేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించడం, పన్ను వ్యవస్థను మరింత పటిష్టం చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో పాటు ఉన్నతాధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఆదాయ వనరుల పెంపు, పన్ను ఎగవేత నియంత్రణకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి.

జీఎస్టీ అధికారులకు ఏఐ ఆధారిత సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సమావేశంలో నిర్ణయించారు. దీనివల్ల పన్ను వసూళ్ల ప్రక్రియ మరింత సమర్థవంతంగా మారడంతో పాటు వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సులభతర వాణిజ్యానికి కూడా తోడ్పాటు అందుతుందని అరవింద్ సుబ్రమణియన్ సూచించారు. పన్నుల లీకేజీలను అరికట్టేందుకు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని ఏఐ సాయంతో అనుసంధానం చేసి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతులు మంజూరు చేసే దశలోనే నిర్మాణ సామగ్రి అవసరాలు, పన్నుల అంచనాలను నమోదు చేయాలని సీఎం పేర్కొన్నారు. అలాగే మీసేవా, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పథకాల సమాచారాన్ని సమీకృతం చేయడం ద్వారా పరిపాలనలో మరింత పారదర్శకత, సమర్థత సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచడంతో పాటు డిజిటల్ పరిపాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.




## శాసన మండలి చైర్మన్‌కు ఘన వీడ్కోలు

బెంగళూరు : కర్ణాటక శాసన మండలి చైర్మన్ బసవరాజ్ హొరట్టి తన పదవిని అత్యంత గౌరవప్రదంగా నిర్వహించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. శాసన మండలి చైర్మన్ పదవికి ఆయన తీసుకొచ్చిన గౌరవం విశేషమని కొనియాడారు. బసవరాజ్ హొరట్టి రాజీనామా నిర్ణయంపై స్పందించిన ముఖ్యమంత్రి, శాసన మండలి చరిత్రలో ఆ పదవికి అంతటి గౌరవం తీసుకొచ్చిన వ్యక్తుల్లో హొరట్టి ఒకరని అన్నారు. సభ నిర్వహణలో ఆయన ప్రదర్శించిన నిష్పాక్షికత, హుందాతనం అందరికీ ఆదర్శంగా నిలిచాయని తెలిపారు.

హొరట్టికి ఘనంగా వీడ్కోలు పలకనున్నట్లు డీకే శివకుమార్ వెల్లడించారు. ఆయనపై ఉన్న అభిమానానికి, గౌరవానికి ప్రతీకగా అన్ని రాజకీయ పక్షాలు కలిసి సత్కరించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



## షార్జా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తెలంగాణ యువకుడికి కేటీఆర్ అండ..



'నమస్తే అమ్మా, నేను కేటీఆర్‌ను.. మీ సమస్య గురించి నాతో విజిత్ చెప్పిండు. నేనున్నా..' అంటూ బతుకుదెరువు కోసం పరాయి దేశం వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి కుటుంబసభ్యులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి భరోసానిచ్చారు.

## రెబల్ ఎంపీలకు మోదీ భరోసా

### 'ఎన్డీఏలో ప్రతి ఒక్కరికీ గౌరవం' - పార్లమెంట్ సమావేశాలపై ఆందోళన అభివృద్ధి పనుల కోసం పీఎంవోను సంప్రదించండి



2

## చేనేతకు రాష్ట్రపతి ప్రశంసలు

– జాతీయ చేనేత పురస్కారాల ప్రదానం

– రాష్ట్రపతి భవన్‌ల ఘన వేడుకలు

– చేనేత వారసత్వాన్ని కొనియాడిన ద్రౌపది



2

మొదటిపేజీ తరువాయి

# రెబల్ ఎంపీలకు మోదీ భరోసా



న్యూఢిల్లీ: ప్రతిపక్ష పార్టీల నుంచి ఎన్డీఏ కూటమిలో చేరిన ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను వారికి అండగా ఉంటానని స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన అల్పాహార సమావేశంలో కొత్తగా ఎన్డీఏలో చేరిన లోక్‌సభ సభ్యులతో ప్రధాని సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నుంచి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన ఏడుగురు ఎంపీలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయి నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరిన 20 మంది ఎంపీలు, అజిత్ పవార్ వర్గానికి చెందిన ఇద్దరు ఎంపీలతో పాటు మొత్తం సుమారు 45 మంది సభ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి సర్వోన్నత వేదిక అని పేర్కొన్నారు. సభ చర్చల్లో చురుకుగా పాల్గొని ప్రజల సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. తరచూ జరుగుతున్న అంతరాయాల కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి షిండే శివసేనలో చేరిన ఎంపీలతో ప్రధాని మరాఠీ భాషలో ప్రత్యేకంగా మాట్లాడినట్లు సమాచారం. "ఆందోళన చెందకండి.. నేను మీతో ఉన్నాను" అని వారికి భరోసా ఇచ్చారు. ఎన్డీఏ ఒక కుటుంబమని, కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి సమాన గౌరవం, అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీలకు ప్రధాని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఏ అంశమైనా నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని చెప్పారు. రైతులు, కార్మికులు, పేదల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్లమెంట్‌లో కీలక రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సమీకరించే క్రమంలోనే ఎన్డీఏలో చేరిన కొత్త ఎంపీలతో ప్రధాని సమావేశం నిర్వహించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సమావేశం అనంతరం ప్రధాని ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

మొదటిపేజీ తరువాయి

# చేనేతకు రాష్ట్రపతి ప్రశంసలు



న్యూఢిల్లీ:12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై సంత్ కబీర్ చేనేత పురస్కారాలు, జాతీయ చేనేత పురస్కారాలు--2025 విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ భారత నాగరికత పరిణామ క్రమంలో చేనేతకు శతాబ్దాల చరిత్ర ఉందని పేర్కొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను ప్రతిబింబించే గొప్ప వారసత్వంగా చేనేత రంగం నిలిచిందన్నారు.

భారతదేశంలోని విభిన్న ప్రాంతాల కళాత్మక నైపుణ్యాన్ని చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని రాష్ట్రపతి తెలిపారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన నేసిన వస్త్రాలు భారత వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత కళలను ఆధునిక రూపకల్పనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమర్థవంతమైన బ్రాండింగ్, అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానం ద్వారా చేనేత ఉత్పత్తులకు మరింత విస్తృత అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు.

యువ పారిశ్రామికవేత్తలు, రూపకర్తలు, నవ్య ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలు చేనేత రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలవని రాష్ట్రపతి సూచించారు. సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దితే భారత చేనేత ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందన్నారు. చేనేత రంగం లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. చేనేత కళాకారుల కృషి దేశ గర్వకారణమని కొనియాడుతూ, వారి సేవలను

# ఏఐతో కొత్త వైరస్‌ల సృష్టి

- స్టాన్‌ఫోర్డ్ పరిశోధనకు ప్రపంచవ్యాప్త గుర్తింపు
- బ్యాక్టీరియాలపై పోరాటానికి కొత్త దారి
- భద్రతా ప్రమాణాలపై నిపుణుల చర్చ



అమెరికా: కృత్రిమ మేధ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఏఐ సాయంతో ప్రకృతిలో ఇప్పటివరకు లేని కొత్త వైరస్‌లను రూపొందించి శాస్త్ర ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఈ పరిశోధనలో రూపొందించిన వైరస్‌లలో 16 వైరస్‌లు ప్రయోగశాల పరీక్షల్లో విజయవంతంగా పనిచేయడం విశేషంగా మారింది. ఈ వైరస్‌లు మనుషులు, జంతువులు, మొక్కలకు ఎలాంటి హాని కలిగించకుండా కేవలం బ్యాక్టీరియాలపై మాత్రమే దాడి చేసే విధంగా రూపొందించబడ్డాయి. శాస్త్రవేత్తలు ఈ పరిశోధన కోసం 'ఈవో-1', 'ఈవో-2' పేర్లతో ప్రత్యేక కృత్రిమ మేధ నమూనాలను వినియోగించారు. సాధారణంగా భాషా నమూనాలు పదాల క్రమాన్ని అంచనా వేసినట్లే, ఈ వ్యవస్థలు డీఎన్‌ఏలోని జన్యు అక్షరాల క్రమాన్ని అంచనా వేసి కొత్త వైరస్‌ల నిర్మాణాలను రూపొందించాయి. లక్షలాది జన్యు సమాచార నమూనాలను విశ్లేషించిన అనంతరం పూర్తిగా కొత్త వైరస్‌ల రూపకల్పన సాధ్యమైందని పరిశోధకులు వెల్లడించారు.

ఏఐ రూపొందించిన లక్షల వైరస్ నమూనాల్లో సుమారు 300 నమూనాలను ఎంపిక చేసి ప్రయోగశాలలో తయారు చేశారు. అనంతరం వాటిని వివిధ రకాల బ్యాక్టీరియాలపై పరీక్షించారు. ఈ పరీక్షల్లో 16 వైరస్‌లు సమర్థవంతంగా పనిచేసి తమ సామర్థ్యాన్ని నిరూపించాయి. కొన్ని వైరస్‌లు సహజసిద్ధంగా ఉండే వైరస్‌ల కంటే వేగంగా అభివృద్ధి చెందగా, మరికొన్ని సాధారణ వైరస్‌లకు నిరోధక శక్తి పెంచుకున్న ఈ.కోలై వంటి బ్యాక్టీరియాలను కూడా విజయవంతంగా నాశనం చేశాయి.

ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్స్‌కు లొంగని బ్యాక్టీరియా సమస్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిశోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. భవిష్యత్తులో అవసరానికి అనుగుణంగా నిర్దిష్ట బ్యాక్టీరియాలను లక్ష్యంగా చేసుకుని కొత్త వైరస్‌లను రూపొందించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం చికిత్సకు సవాలుగా మారుతున్న అనేక బ్యాక్టీరియా సంబంధిత వ్యాధులను ఎదుర్కొనే కొత్త మార్గాలు అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు.

అయితే ఈ సాంకేతికత విజయంతో పాటు కొన్ని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. వైరస్‌ల జన్యు నిర్మాణాన్ని కృత్రిమ మేధతో రూపొందించే సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో దుర్వినియోగ అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేమని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రంగంలో స్పష్టమైన అంతర్జాతీయ నియంత్రణలు, భద్రతా ప్రమాణాలు అవసరమని వారు సూచిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహించిన పరిశోధనలో మనుషులు, జంతువులు లేదా మొక్కలకు సోకే వైరస్‌ల సమాచారాన్ని వినియోగించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. అన్ని ప్రయోగాలను కఠిన భద్రతా ప్రమాణాల మధ్య నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రముఖ శాస్త్రీయ పత్రిక 'సైన్స్'లో ప్రచురితమవడంతో ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించాయి. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీయగల ఈ సాంకేతికత భవిష్యత్తులో మరిన్ని కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఫార్చ్యూన్ సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతున్నారా?..

ఫుడ్ సేఫ్టీ నాణ్యత పరీక్షల్లో విఫలమైనట్లు తెలుసా?
విటమిన్ ఎ, డి ప్రమాణాలు అందుకోలేదని ఎఫ్‌ఎస్ఎస్ఏఐ చర్యలు..
ప్రముఖ కంపెనీపై జరిమానా

న్యూఢిల్లీ:దేశంలో ప్రముఖంగా వినియోగించే ఫార్చ్యూన్ బ్రాండ్ ఫోర్టిఫైడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నాణ్యత పరీక్షల్లో విఫలమైన ఘటన వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. భారత ఆహార భద్రతా మరియు ప్రమాణాల సంస్థ (ఎఫ్‌ఎస్ఎస్ఏఐ) నిర్వహించిన ప్రయోగశాల పరీక్షల్లో సంబంధిత ఆయిల్ నమూనా నిర్దేశిత విటమిన్ ఎ, విటమిన్ డి ప్రమాణాలను చేరుకోలేదని తేలడంతో, తయారీ సంస్థ ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్పై జరిమానా విధించింది.

ఫుడ్ సేఫ్టీ అధికారులు గోవాలో సేకరించిన ఫార్చ్యూన్ ఫ్రయోలా రిఫైండ్ సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్ నమూనాను పరీక్షించగా, ఫోర్టిఫికేషన్ నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన విటమిన్ ఎ, విటమిన్ డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే తక్కువగా ఉన్నట్లు ప్రయోగశాల నివేదిక వెల్లడించింది. దీంతో ఈ ఉత్పత్తిని లి"నాణ్యత ప్రమాణాలకు తక్కువ స్థాయిలో ఉన్న ఉత్పత్తి"లిగా గుర్తించినట్లు ఎఫ్‌ఎస్ఎస్ఏఐ తెలిపింది.

కంపెనీ తొలి నివేదికను సవాలు చేస్తూ రిఫరల్ ల్యాబ్‌లో మళ్లీ పరీక్షించాలంటూ కోరినా, అక్కడ కూడా విటమిన్ డి లోపం నిర్ధారణ కావడంతో ఎఫ్‌ఎస్ఎస్ఏఐ చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. అనంతరం సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు కంపెనీపై జరిమానా విధించారు.

**వినియోగదారులు ఏం చేయాలి?**

ఆహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ చర్య ఉత్పత్తి మొత్తం ఆరోగ్యానికి హానికరమని నిర్ధారించడం కాదు. అయితే ఫోర్టిఫైడ్ అని లేబుల్‌పై పేర్కొన్న పోషక విలువలు వాస్తవంగా ఉండాలని చట్టం చెబుతోంది. అందువల్ల




వినియోగదారులు ప్యాకెట్‌పై ఉన్న ఫోర్టిఫికేషన్ లోగో, తయారీ వివరాలు, గడువు తేదీ, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

**ప్రజానేత్ర విశ్లేషణ**

ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులపై నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడం అత్యంత అవసరం. ప్రముఖ బ్రాండ్లకైనా నిబంధనలు ఒకేలా వర్తిస్తాయని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. ఫుడ్ సేఫ్టీ సంస్థల తనిఖీలు మరింత కఠినంగా కొనసాగితేనే వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నేతన్నల కోసం సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

హైదరాబాద్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన చేనేత రంగం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేయడం వల్ల వేలాది నేతన్న కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి పథకాలు చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాయని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం భారీగా వాటా జమ చేసిన 'నేతన్నకు చేయూత' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీ వంటి ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాలను నిలిపివేసి చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం బీమా, చేయూత పథకాలతో పాటు ఇతర ప్రోత్సాహకాలు కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని కేటీఆర్ మండిపడ్డారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణాల మాఫీ, జీఎస్టీ భారం భరిస్తామన్న హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు.

# ఏఐతో పాలనకు పదును.......

హైదరాబాద్, రాష్ట్రంలో సాంకేతిక ఆధారిత పాలనకు మరింత ఊతమిచ్చే దిశగా కృత్రిమ మేధ వినియోగాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో జీఓవీకనెక్ట్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీసేవ) సంయుక్తంగా నిర్వహించిన 'ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాన్‌క్లేవ్--తెలంగాణ'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విధాన రూపకర్తలు, సాంకేతిక రంగ నిపుణులు, డిజిటల్ పాలన నిపుణులతో మంత్రి ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ సేవల అందజేతలో సామర్థ్యాన్ని పెంచడం, నిర్ణయాల ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రజల సమస్యల పరిష్కారంలో సాంకేతికతను వినియోగించడం వంటి అంశాలపై సదస్సులో విస్తృత చర్చ జరిగింది. భవిష్యత్ పాలనలో కృత్రిమ మేధ కీలక సాధనంగా మారనున్న నేపథ్యంలో దాని వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు శాఖల్లో డిజిటల్ సేవలను విస్తృతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ సేవలను మరింత ప్రజానుకూలంగా మార్చేందుకు కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు.

కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాల ద్వారా ప్రభుత్వ సేవలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజల అవసరాలను మరింత సమర్థంగా తీర్చే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. సాంకేతికతను ప్రజా సంక్షేమానికి ఉపయోగించే దిశగా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాలనను మరింత సమర్థవంతం, పారదర్శకం, అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దేందుకు కృత్రిమ మేధతో పాటు అభివృద్ధి చెందుతున్న ఇతర సాంకేతిక పరిజ్ఞానాల వినియోగానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సాంకేతికత ఆధారిత సుపరిపాలన ద్వారా ప్రతి పౌరుడికి మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా కిరణ్ కుమార్

**ఢిల్లీలో బీఆర్ఎస్‌పై విమర్శలు – తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపు**
**తెలంగాణ హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య**



న్యూఢిల్లీ, ఆగస్టు 7 : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా కమిటీ చైర్మన్‌గా నియమితులైన చామల కిరణ్ కుమార్ తనపై నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కే.సి. వేణుగోపాల్‌తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిరణ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వరుస ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన తర్వాత బీఆర్ఎస్ పూర్తిగా సామాజిక మాధ్యమాలకే పరిమితమైన పార్టీగా మారిందని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అసత్య ప్రచారాలు నిర్వహిస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆయన అన్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు వంటి అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గోదావరి జలాలు, బనకచర్ల అంశాల్లో తెలంగాణ హక్కులను కాపాడేందుకు కేంద్రంతో పోరాడి రాష్ట్ర ప్రయోజనాలను రక్షించినట్లు తెలిపారు. ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని కిరణ్ కుమార్ తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచాలని పిలుపునిచ్చారు.

# నీట్ లీక్‌లో నిపుణుల పాత్ర

**– సీబీఐ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు – ప్రశ్నలు కంఠస్థం చేసి బయటకు తరలింపు**
**– కోచింగ్ కేంద్రాల ద్వారా విద్యార్థులకు చేరవేత – 20 వేల పేజీల ఆధారాలు కోర్టుకు సమర్పణ**

న్యూఢిల్లీ, ఆగస్టు 7 : దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మొత్తం 94 పేజీలతో రూపొందించిన నివేదికలో ప్రశ్నపత్రం లీకేజీకి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీతో అనుబంధం ఉన్న ముగ్గురు సబ్జెక్టు నిపుణులే ప్రధానంగా బాధ్యత వహించినట్లు పేర్కొంది. ప్రశ్నపత్రాల రూపకల్పన ప్రక్రియలో భాగస్వాములైన ఈ నిపుణులు తమకు ఉన్న ప్రాప్యతను దుర్వినియోగం చేసి గోప్య సమాచారాన్ని బయటకు చేరవేసినట్లు దర్యాప్తులో తేలిందని వెల్లడించింది. సీబీఐ గుర్తించిన నిందితుల్లో పీవీ కులకర్ణి, మనీశ్ మాంధారే, మనీషా హవల్దార్ ఉన్నారు. వీరిలో కులకర్ణి రసాయన శాస్త్రం, మాంధారే వృక్ష శాస్త్రం, హవల్దార్ భౌతిక శాస్త్ర విభాగాలకు చెందిన నిపుణులు. ప్రశ్నపత్రాల తయారీ సమయంలో వీరు ప్రశ్నలను కంఠస్థం చేసుకుని, అనంతరం వాటిని చీటీలపై రాసుకున్నట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నలకు సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాలలో గుర్తులు పెట్టి భద్రపరిచినట్లు కూడా సీబీఐ వెల్లడించింది.

ప్రశ్నల రూపకల్పన, అనువాద విభాగాలకు ఈ నిందితులకు ప్రత్యక్ష ప్రాప్యత ఉండటంతో గోప్య సమాచారాన్ని కోచింగ్ కేంద్రాలకు చేరవేసినట్లు దర్యాప్తులో తేలింది. డిజిటల్ మార్గాలను వినియోగించకుండా వ్యక్తిగత పరిచయాల ద్వారానే సమాచారాన్ని అందించినట్లు గుర్తించారు. ఈ విధంగా ఆధారాలు మిగలకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వ్యవహరించినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. లీకైన



ప్రశ్నలను కోచింగ్ తరగతుల్లో విద్యార్థులతో సాధన చేయించినట్లు సీబీఐ తెలిపింది. సులభంగా గుర్తుంచుకోగల ప్రశ్నలను ముందుగా కంఠస్థం చేసుకుని, తరువాత హోటల్ గదుల్లో కాగితాలపై రాసేవారని దర్యాప్తులో తేలింది. విద్యార్థుల విజయశాతం పెంచడం, ఆర్థిక లాభాలు పొందడం ప్రధాన లక్ష్యాలుగా ఈ కుట్ర సాగినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో పరీక్ష నిర్వహణ సంస్థ భద్రతా వ్యవస్థలో కూడా లోపాలు ఉన్నట్లు సీబీఐ గుర్తించింది. పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు, భద్రతా పరిశీలనలు సమర్థవంతంగా జరగలేదని నివేదికలో పేర్కొంది. ముఖ్య నిందితుల్లో ఒకరైన కులకర్ణి మూడు ప్రశ్నపత్రాల సమితులకు సంబంధించిన అనువాద బాధ్యతలు నిర్వహించాడని, కేవలం మూడు రోజుల్లో 135 ప్రశ్నలను అనువదించినట్లు వెల్లడించింది. కేసులో ఇప్పటివరకు మొత్తం 13 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ తెలిపింది. వీరిలో సబ్జెక్టు నిపుణులు, కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు, మధ్యవర్తులు, లీకేజీ ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులు ఉన్నారు. దర్యాప్తులో భాగంగా 360 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసి, సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం నిందితులందరూ న్యాయపరమైన నిర్బంధంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

**తెలంగాణ పోలీసుల అవగాహన ప్రచారం**
**జీవితాన్ని ఎంచుకోండి.. మాదకద్రవ్యాలను కాదు**

హైదరాబాద్, ఆగస్టు 7 : మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరిస్తూ తెలంగాణ పోలీసులు ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితాన్ని ఎంచుకోండి" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్ ద్వారా యువతలో చైతన్యం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. మాదకద్రవ్యాల బారిన పడితే విద్య, ఉపాధి, కుటుంబ జీవితం, ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటాయని పోస్టర్‌లో స్పష్టం చేశారు. యువత తమ భవిష్యత్తును స్వయంగా నిర్మించుకోవాలని, క్షణిక ఆనందాల కోసం జీవితాన్ని పణంగా పెట్టవద్దని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు పెరగడంతో పాటు నేరాల వైపు మళ్లే ప్రమాదం కూడా ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సమాజం, కుటుంబం, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని గుర్తు చేశారు.

విద్యార్థులు, యువకులు చెడు స్నేహాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలపై సమాచారం లభించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను చైతన్యపరుస్తున్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అనే సందేశంతో తెలంగాణ పోలీసులు ప్రజలకు పిలుపునిచ్చాం

## ఆసుపత్రి సేవలపై అచ్చెన్న దృష్టి

శ్రీకాకుళం, ఆగస్టు 7: కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని మంత్రి పేర్కొన్నారు.

రోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి చికిత్సలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. మందుల లభ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య పరికరాల నిర్వహణ, పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఎన్డీయే కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ముందుకు సాగుతోందని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలను దశలవారీగా విస్తరిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, రోగుల సౌకర్యాలు, సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించిన మంత్రి, ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# లోక్‌సభలో ఎంజీఎం సమస్యల ప్రస్తావన....

**– వరంగల్ వైద్య సేవల బలోపేతానికి ఎంపీ డిమాండ్**
**– ఎంజీఎం, వైద్య కళాశాల సమస్యలపై దృష్టి**
**– ఖాళీల భర్తీకి కేంద్రాన్ని నిలదీసిన డా.కడియం కావ్య**

న్యూఢిల్లీ, ఆగస్టు 7: వరంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల, మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రితో పాటు కేంద్ర సహకారంతో నడిచే ప్రభుత్వ వైద్య సంస్థల్లో నెలకొన్న సిబ్బంది కొరత అంశాన్ని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. వైద్య సేవల నాణ్యతపై ప్రభావం చూపుతున్న ఖాళీల భర్తీ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎంపీ కడియం కావ్య వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది కొరతపై ప్రశ్నించారు. ముఖ్యంగా వరంగల్ ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఖాళీలు ఎక్కువగా ఉండటంతో వైద్య సేవలపై ఒత్తిడి పెరుగుతోందని వివరించారు.

ఎంజీఎం ఆసుపత్రి తెలంగాణలో కీలక వైద్య కేంద్రంగా కొనసాగుతోందని, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రోగులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తగిన సంఖ్యలో నిపుణ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది లేకపోవడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడుస్తున్న వైద్య సంస్థల్లో కూడా సిబ్బంది కొరత కొనసాగుతుండటం ఆందోళనకరమని ఎంపీ తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు, వాటి భర్తీకి కేంద్రం చేపడుతున్న చర్యలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు.

వైద్య రంగంలో మౌలిక వసతుల విస్తరణతో పాటు తగిన మానవ వనరులు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని కడియం కావ్య అభిప్రాయపడ్డారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ డిమాండ్ చేశారు. వైద్య సంస్థల్లో సిబ్బంది కొరతను నివారించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు



# వరుణ యాగానికి సీఎం నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 7 : రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, నదులు జలకళ సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్‌లో యాగం నిర్వహించనున్నారు.

నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో వరుణ యాగానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహించనున్నారు.

కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, రాష్ట్రంలోని చెరువులు నిండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని సంకల్పిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు తొలగి వ్యవసాయ రంగానికి మేలు జరగాలని ప్రార్థనలు నిర్వహించనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో యాగ కార్యక్రమాలు జరుగనున్నాయి.

యాగం నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాయి. యాగం అనంతరం జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, పాడిపంటల సమృద్ధి, జలవనరుల అభివృద్ధి కోసం ఈ ప్రత్యేక యాగాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.



# వర్షంలోనూ ప్రజల మధ్య మంత్రి

## పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయి పర్యటన
## ఏదులాపురం అభివృద్ధికి రూ.100 కోట్లు
## కాలనీల సమస్యలపై అధికారులకు ఆదేశాలు

ఖమ్మం, ఆగస్టు 7:వర్షం కురుస్తున్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీలలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి వార్డుల్లో పర్యటించిన మంత్రి స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు. గ్రామ పంచాయతీల కలయికగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తుమ్మ చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరా మెరుగుదల, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం ప్రజలు సమర్పించిన వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పేర్కొన్నారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో పనుల్లో నాణ్యతను కాపాడాలని సూచించారు.పర్యటనలో భాగంగా సాయిగణేష్ నగర్‌లోని ఓ చిన్న టీ దుకాణం వద్ద మంత్రి ఆగి స్థానికులతో కలిసి టీ తాగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, వర్షపు నీటి నిల్వ వంటి అంశాలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా పాలనను మరింత ప్రజలకు చేరువ చేస్తున్నామని మంత్రి తెలిపారు.



# నిజామాబాద్ అభివృద్ధికి ప్రతిపాదనలు

## నితిన్ గడ్కరీని కలిసిన ధన్‌పాల్ సూర్యనారాయణ



న్యూఢిల్లీ, ఆగస్టు 7: నిజామాబాద్ నగరం, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక మౌలిక సదుపాయాల ప్రతిపాదనలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమర్పించారు. బీజేపీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌లతో కలిసి ఆయన గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి పనులకు కేంద్ర సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా నాందేవ్‌వాడ--దేవి రోడ్డు--రైల్వే స్టేషన్ వంతెనకు అదనపు బ్రిడ్జి నిర్మాణం కోసం సుమారు రూ.100 కోట్ల ప్రతిపాదనను సమర్పించారు.

ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనను అందజేశారు. ఈ పనులు పూర్తైతే నగరంలోని రవాణా సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వివరించారు. వర్ని--నిజామాబాద్--డిచ్‌పల్లి--ఇందల్‌వాయి--బీంగల్ మీదుగా కుమ్మర్‌పల్లి వరకు సుమారు 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ఏర్పాటు చేయాలని కూడా కేంద్ర మంత్రిని కోరారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

రేడియో స్టేషన్ నుంచి ముదక్‌పల్లి పాత గ్రామపంచాయతీ కార్యాలయం వరకు ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి, అలాగే రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి దేవి థియేటర్, ఎన్టీఆర్ చౌరస్తా, దుబ్బ మీదుగా కాలూర్ వరకు లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు. ఈ పనులు నగర విస్తరణకు దోహదపడతాయని వివరించారు. నిజామాబాద్ ప్రాంత సమగ్ర అభివృద్ధి, మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంగారెడ్డిలో శాఖల పనితీరుపై సమీక్ష

## దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సమావేశం
## వైద్యం, విద్య, తాగునీటిపై ప్రత్యేక చర్చ
## నకిలీ వైద్యుడి ఘటనపై మంత్రి ఆగ్రహం





సంగారెడ్డి, ఆగస్టు 7: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యం, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖల్లో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. వైద్య ఆరోగ్య సేవల బలోపేతంపై ప్రత్యేకంగా చర్చించిన మంత్రి, జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ వైద్యుడి స్థానంలో నకిలీ వైద్యుడు విధులు నిర్వహించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ నుంచి వివరణ కోరారు. కంకోల్, సింగీతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవం, బర్దిపూర్, సుల్తాన్‌పూర్, నేరడిగుంట ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల పరిస్థితిని సమీక్షించిన మంత్రి, మందులు, వైద్య పరికరాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎంసీహెచ్‌ను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన మంత్రి, ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని చెప్పారు. సంక్షేమ హాస్టళ్ల పనితీరును కూడా సమీక్షించి, భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

రేషన్ కార్డుల పంపిణీ అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి పర్యటన నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిపై సమీక్షించిన మంత్రి, మంజీర, సింగూరు జలాశయాల్లో నీటి నిల్వలు, సరఫరా వ్యవస్థ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు సంబంధిత గ్రామాలు, మున్సిపాలిటీలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు

# చేనేత కార్మికులకు పురస్కారాలు

## యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా సత్కారం
## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
## చేనేత అభివృద్ధికి ఒప్పందాల మార్పిడి

**లక్నో, ఆగస్టు 7 :**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా లక్నోలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేనేత కార్మికులు, హస్తకళాకారులను సత్కరించారు. చేనేత రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి 'సంత్ కబీర్ రాష్ట్ర స్థాయి చేనేత పురస్కారాలు' ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమల అభివృద్ధి పథకం, ఝుల్కారీ బాయి కోరీ చేనేత మరియు పవర్‌లూమ్ అభివృద్ధి పథకాల లబ్ధిదారులకు ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. పథకాల ద్వారా చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ కల్పించే లక్ష్యంతో ప్రముఖ కొనుగోలుదారులతో అవగాహన ఒప్పందాల మార్పిడి కూడా జరిగింది. ఈ ఒప్పందాలు చేనేత ఉత్పత్తులకు కొత్త అవకాశాలు తీసుకురానున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాట్లాడిన యోగి ఆదిత్యనాథ్, చేనేత మరియు హస్తకళలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. కళాకారుల శ్రమ, నైపుణ్యాన్ని ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.

హస్తకళాకారుల గౌరవం, ఆత్మగౌరవం, ఆర్థిక అభివృద్ధి తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసి యువతను ఈ రంగం వైపు ఆకర్షించే ప్రయత్నాలు కొనసాగుతాయని వివరించారు.

చేనేత కార్మికులు, హస్తకళాకారుల భవిష్యత్తు అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యోగి ఆదిత్యనాథ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న అన్ని లబ్ధిదారులకు ఆయన అభినందనలు తెలిపారు.



